క్లుప్తంగా

ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలి



ఆర్మూర్‌టౌన్: ప్రయాణికులను క్షేమంగా గమ్య స్థానాలకు చేర్చాలని ఎంవీఐ వివేకానంద రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, డ్రైవర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంవీఐ వివేకానందరెడ్డి హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం డిపో ఉత్తమ డ్రైవర్, కండక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రమేశ్, డిపో మేనేజర్ రవికుమార్, ఏఎంవీఐ రోహిత్‌రెడ్డి, సాగర్, పారు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఈఆర్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఫౌండేషన్ సొసైటీ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాపరికరాలను అందజేశారు. పేద విద్యార్థులకు తమ సంస్థ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయానంద్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేశ్, గంగామోహన్, నరేందర్‌నాయక్, గంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణానికి విరాళం




బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణానికి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ రూ. లక్ష విరాళాన్ని శుక్రవారం నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, గిరిస్వామి, లోక సుభాష్, ప్రవీణ్, సంజీవ్ థామస్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



కమ్మర్‌పల్లి: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని ఎస్సై అనిల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చౌట్‌పల్లిలో దాత గడ్డం మహేందర్ సహకారంతో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన మహేందర్‌ను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ స్పందన, ఎంఈవో ఆంధ్రయ్య, జీపీ కార్యదర్శి శాంతి కుమార్, వీడీసీ అధ్యక్షుడు కొమ్ముల రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు బాబు, మనవడి అప్పగింత



మాక్లూర్: మండలంలోని మాణిక్‌బండార్ తండాకు చెందిన అశ్విన్(1) అనే చిన్నారి, అమ్మమ్మ తప్పిపోగా మాక్లూర్ పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ఇలా.. తండాకు చెందిన అశ్విన్‌ను శుక్రవారం ఉదయం అమ్మమ్మ ఇంటి నుంచి తీసుకెళ్లింది. ఎంత సేపటికి ఇద్దరు కన్పించకుండా పోవడంతో బాబు తల్లి, తాత కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో వారు కన్పించటంతో పోలీసులు వెంటనే తండాకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తోండ క్యాంపు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ముగిసిన గ్రామ సభలు

- సంక్షేమ పథకాల అమలుపై అధికారులను ప్రశ్నించిన గ్రామస్తులు
- పలుచోట్ల గందరగోళ పరిస్థితి
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్న అధికారులు



వర్ని: జలాల్‌పూర్‌లో అధికారులను నిలదీస్తున్న మహిళ

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టిన గ్రామ, వార్డు సభలు శుక్రవారం ఆర్మూర్, బాల్కొండ, నియోజవర్గాల్లో ముగిశాయి. పలు గ్రామాల్లో చేపట్టిన సభలు నిరసనలు, నిలదీతల మధ్య కొనసాగాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదంటు వర్ని మండలం జలాల్‌పూర్‌లో మహిళలు అధికారులను నిలదీశారు. గ్రామంలో 300 మందికి ఇళ్లు అవసరముండగా 20 మందికే మంజూరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోస్రా మండలం గోవూర్‌లో ఒకే వ్యక్తికి రెండుసార్లు ఇల్లు మంజూరు కావడంపై అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో అర్హులుగా ఉన్న తమకు రేషన్‌కార్డులు రాలేదని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. రెంజల్ మండలంలోని రెంజల్, సాటాపూర్, తాడ్‌బిలోలి, వీరన్నగుట్ట, వీరన్నగుట్ట తండా గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. అధికారులు అర్హుల జాబితాను గ్రామసభలో వినిపించడంతో గ్రామప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనర్హులను ఎంపిక చేశారని ఆరోపిస్తు అధికారులను నిలదీశారు. అధికారులు సర్దిచెప్పినా ప్రజలు వినిపించుకోలేదు. పోతంగల్ మండలం హంగర్గ ఫారం గ్రామంలో సభ రసాభాసగా మారింది. సంక్షేమ పథకాల జాబితాల తమ పేర్లు లేవని గ్రామస్తులు నిలదీశారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. గ్రామసభల్లో చదివిన పేర్లు ముసాయిదా జాబితా నుంచి అనర్హులను తొలగించడానికి మాత్రమేనన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 22, 11, 16, 29, 36, 12వ వార్డుల్లో అధికారులు వార్డు సభలు నిర్వహించారు. మున్సిపల్ అధికారులు రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఆర్థిక సహాయం వచ్చిన వారి పేర్లను చదివి వినిపించారు. అలాగే రానివారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మెండోరా మండలం పోచంపాడ్, నెహ్రూనగర్ కాలనీల్లో గ్రామసభలు నిర్వహించారు. అర్హులకు పథకాలను అందించేందుకే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు మెండోరా మండల ప్రత్యేకాధికారి ఆంజనేయులు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు కాకుండ అనర్హులకు ఇస్తున్నారని గ్రామస్తులు అధికారుల తీరుపై మండిపడ్డారు. సభల్లో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రుద్రూర్: హంగర్గా ఫారంలో..



వేల్పూర్: పచ్చలనడ్కుడలో..



రెంజల్ గ్రామసభలో..



బాల్కొండ: పోచంపాడ్‌లో సభ నిర్వహిస్తున్న అధికారులు



ఆర్మూర్ పట్టణంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



చేపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రమోహన్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నందిపేట్: మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన బీమర్తి మోక్షిత్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి అబాకస్, వేదిక్ మ్యాచ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవి శుక్రవారం తెలిపారు. అలాగే శ్రీనిస్, రిషిక, నందిత, శ్రీ సుతాన్, హర్షిత శ్రీజరెడ్డి, రిషిత రాజ్ జిల్లాస్థాయిలో కన్సోలేషన్ బహుమతులు గెలిచారన్నారు. అనంతరం విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అరుణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

సంకల్ప్ దివస్ ర్యాలీ



నందిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

నందిపేట్: మండల కేంద్రంలో సంకల్ప్ దివస్ లోభాగంగా శుక్రవారం ఇన్సూరెన్స్ ఫర్ ఆల్ అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజింగ్ పార్ట్‌నర్ మహమ్మద్ హబీబ్ మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్‌రెడ్డి, ఏబీఎం సాయిరాం, లీడర్లు రవీందర్, మల్లేశ్, శివ, లింగన్న, పవిత్ర, విజయలక్ష్మి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఎన్నికల్లో పోటీచేస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న అరుణజ్యోతి

ఆర్మూర్‌టౌన్: రాష్ట్రంలో నిర్వహించే ప్రతి ఎన్నికల్లో ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ పోటీ చేస్తుందని పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చి దొరల పాలన కొనసాగిస్తోందని అన్నారు. కోటార్మూర్‌లోని ఇరిగేషన్ స్థలంలో కబ్జాకు గురైనప్పుడు ఇరిగేషన్ అధికారులు హద్దులు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. కబ్జాకు గురైన స్థలాలపై ఇకపై పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఫిబ్రవరి 5న ఆర్మూర్‌లో మహిళా సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యాక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎర్రం రాకేశ్, లక్క అశోక్, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్ మాజీ సర్పంచ్ వేంపల్లి కిషన్‌గౌడ్ ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వారి వెంట ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు రఫీ, మేడం రమేశ్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నందిపేట్: మండలంలోని వెల్మల్‌లో శుక్రవారం బడుగు బలహీన వర్గాల(పెద్ద పంత) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటజాన్, ఉపాధ్యక్షుడిగా సాయిలు, కార్యదర్శిగా జడల సందీప్, ట్రెజరర్‌గా గాదారి శ్రీధర్, సలహాదారులుగా గుండెం భోజన్న, ఉమ్మెడ మోహన్, డైరెక్టర్లుగా బండారి రామాగౌడ్, శివసారి వినోద్, బురిపెల్లి భోజన్న, ఎనుమర్తి సక్కరి, సంగెం రాజన్న, చింతకుంట గంగారాం, తూర్పు హన్మాండ్లు, కిషన్, నల్లన్న, సంగం వినోద్, సాదుల గంగాధర్, గోవు పెంటన్న, శనిగం విజయ్, వంజరి గంగాధర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారి కమ్మర్‌పల్లికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తాహెర్‌ను సన్మానించి, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు బుచ్చి మల్లయ్య, ప్రదీప్‌కుమార్, సుంకెట శ్రీను, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి



ఆర్మూర్‌టౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్‌కు సూచించారు. ఇటీవల జరిగిన తెలంగాణ యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా విజయం సాధించిన ప్రశాంత్‌ను హైదరాబాద్‌లో వెంకట్ సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



పాన్ గల్లీలో జెండాలను పంపిణీ చేస్తున్న నాయకులు



పెగడపల్లిలో..

బోధన్‌టౌన్/ బోధన్‌రూరల్: హర్‌ఘర్ తిరంగా అనే నినాదంతో ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కందికట్ల వాసు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాన్ గల్లీలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగుర వేయడం వలన భారతీయుల్లో ఐక్యతను చాటుతుందని అన్నారు. కార్యక్రమంలో గుమ్ముల ప్రకాశ్, పాండవుల భూమయ్య, భూమేశ్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు. బోధన్ మండలంలోని పెగడపల్లిలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకొని నిర్వహిస్తున్న హర్‌ఘర్ తీరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామస్తులు సాయిబాబా, సతీశ్, ఆకాశ్, రాజు, అశోక్, సాయిలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలో కమిషనరేట్ విజయవంతం చేయాలి



బోధన్‌రూరల్: సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారానికి ఈ నెల27న తలపెట్టిన చలో కమిషనరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకురాలు సంధ్యారాణి కోరారు. ఈ మేరకు శుక్రవారం బోధన్ మండల ఏఎన్‌ఎంలు ఈ నెల 27న చేపట్టే కార్యక్రమంపై సమాచారం అందిస్తూ డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు. ప్రతి పీహెచ్‌సీ నుంచి ఇద్దరు చొప్పున ఏఎన్‌ఎంలు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో చక్రపాణి, సంధ్యారాణి, సావిత్రి, విజయలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు సర్వసభ్య సమావేశం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం పేర్కొన్నారు. ఉదయం సమావేశంతో పాటు వీడ్కోలు, సన్మాన కార్యక్రమం ఉంటుందని అన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

■ 28న కబడ్డీ జట్టు ఎంపిక

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని భూదేవి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 28న 71వ సీనియర్ కబడ్డీ జట్టు క్రీడాకారుల ఎంపిక ఉంటుందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ శుక్రవారం పేర్కొన్నారు. ఫిబ్రవరి 4 నుంచి ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్ డిస్ట్రిక్ సీనియర్ కబడ్డీ చాంపియన్ పోటీలు ఉంటాయన్నారు. అందుకోసం జిల్లా జట్టు ఎంపిక చేయబడుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రిపోర్టు చేయాలని సూచించారు.

■ 28న కళాశాలలో వర్క్‌షాప్



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఒక రోజు కార్యశాల నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈనెల 28న రీసర్చ్ మెథడాలజీ అండ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రిపరేషన్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వర్క్‌షాప్‌నకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జి లింగన్న, ఎన్ అంబర్‌సింగ్, ఎస్ జాన్‌సుమాక్, శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిపై అవగాహన



నందిపేట్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఫైలేరియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా వ్యాధిగ్రస్తులకు డాక్టర్ ప్రవీణ్ చికిత్సలు చేశారు. కాళ్ల వాపు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, పద్మావతి, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	స్కైయ్ ఫోర్స్(హిందీ)-12.25 6.30, గేమ్ ఛేంజర్(తెలుగు)- 3.10, పుష్ప-2(తెలుగు)-9.15
స్క్రీన్-2 –	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) - 10.00, 1.00, 4.00, 7.00,10.00
స్క్రీన్-3–	డాకు మహారాజు (తెలుగు)- 10.15, 10.10, హత్య(తెలుగు)-1.20, ఐ డెంటిటీ(తెలుగు)-4.25, గాంధీ తాత చుట్టు (తెలుగు)-7.40
స్క్రీన్-4	సంక్రాంతికి వస్తున్నాం - 12.00, 3.00, 6.00, 9.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) - 11.00, 1.30, 4.30, 7.20, 10.00
స్క్రీన్-2	ఐడెంటిటీ(తెలుగు)-10.40, డాకు మహారాజు (తెలుగు)-4.30 10.20, గేమ్ ఛేంజర్(తెలుగు)-7.20
స్క్రీన్-3	స్కైయ్ ఫోర్స్(హిందీ)- 11.00, 1.35, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) - 10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-2	స్కైయ్ ఫోర్స్(హిందీ)-10.50, 1.35, 7.25, 10.10, డాకు మహారాజు (తెలుగు)- 4.20
స్క్రీన్-3	తొలిమనసు(తెలుగు)-11.05, గాంధీ తాత చుట్టు(తెలుగు)-2.10 8.00, గేమ్ ఛేంజర్(తెలుగు)- 4.40, హత్య (తెలుగు)-10.30
స్క్రీన్ -4	డియర్ కృష్ణ(తెలుగు)-11.00 ఐడెంటిటీ (తెలుగు)-1.45 హాంగ్‌కాంగ్ వారియర్స్(తెలుగు)-5.00 డాకు మహారాజు(తెలుగు)-7.20 పుష్ప-02(తెలుగు)-10.25
లలితామహల్	గేమ్ ఛేంజర్ (తెలుగు)
దేవి	డాకు మహారాజు (తెలుగు)
నటరాజ్	స్కైయ్ ఫోర్స్(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	82,400	వెండి(కిలో)	95,700
22 క్యారెట్స్	76,035	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పాఠశాలలో పుడమి అక్షర రూపంలో కూర్చున్న విద్యార్థులు

వేల్పూర్: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని ఎంఈవో రేణుక పేర్కొన్నారు. మండలంలోని మోతె ఉన్నత పాఠశాలలో శుక్రవా రం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో పర్యావరణం, వృక్ష సంపదపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడా రు. పర్యావరణాన్ని కాపాడుకున్నప్పుడే మాన వ మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో అనుదీప్, జ్ఞానేశ్వర్, వి గణేశ్, కవిత, శ్రావణి, రత్నం, నరసింహారావు, సురేశ్‌కుమార్, విద్యార్థులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో అంబేడ్కర్ ఫొటో పెట్టాలి

వేల్పూర్: రిపబ్లిక్ డే వేడుకల్లో అంబేడ్కర్ ఫొటో, రాజ్యాంగ పీఠిక పెట్టాలని వేల్పూర్ మండల అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజున అంబేడ్కర్‌ను గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ ఫొటో పెట్టే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

వేల్పూర్: పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన సుంకరి విజయ అనే మహిళ శుక్రవారం వేల్పూర్ పీహెచ్‌సీలో తన మంగళసూత్రం పోగొట్టుకోగా ఆస్పత్రి సిబ్బంది ఆమెకు అప్పగించారు. వేల్పూర్ ఆస్పత్రికి చికిత్సకోసం వచ్చిన ఆమె బంగారు మంగళసూత్రం కింద పడిపోయింది. ఆస్పత్రి సిబ్బంది దానిని గుర్తించి, ఆమెను పిలిచి అందజేశారు. కార్యక్రమంలో వైద్యురాలు వీణ, స్టాఫ్ నర్సు యాదమ్మ, ఎల్‌టీ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.